

విద్యార్థులను సురక్షితంగా చేర్చండి

కేంద్రానికి ఎంపీ బైరెడ్డి శబరి లేఖ

నంద్యాల రూరల్, మే 9 (ఆంధ్రజోతి): యుద్ధవాతావరణ పరిస్థితుల్లో జమ్మూకశ్మీర్‌లో చిక్కుకున్న ఏపీ విద్యార్థులను స్వస్థలాలకు క్షేమంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి లవ్ అగర్వాల్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓలేఖను కేంద్రానికి పంపారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉన్నతాధికారులు పూర్తిరక్షణలో స్వస్థలాలకు చేర్చుతారని తెలిపారు.



మూత పడిన ఓబులంపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్

సమ్మెలో సీహెచ్‌వోలు

- జీవనభృతి కోసం పోరుబాట
- మూతపడిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- గ్రామీణులకు అందని వైద్యసేవలు
- ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు సేవలందించాలి: డీఎంహెచ్‌వో వెంకటరమణ

నంద్యాల హస్పిటల్, మే 9 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వోలు) సమ్మెబాట చేపట్టారు. పల్లెల్లో నిత్యం ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే వారు ప్రస్తుతం రోడ్డెక్కారు. దీంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూతపడ్డాయి. దీంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని జీవన భృతి కోసం పడుతున్న కష్టానికి ప్రతిఫలం అందించాలని 12 రోజులుగా నిరవధిక సమ్మెలో సీహెచ్‌వోలు పాల్గొంటున్నారు. మహానంది మండలంలోని సీతారామపురం, ఆళ్లగడ్డ మండలంలోని ఓబులంపల్లె, ఆర్ కృష్ణాపురం, పాణ్యం మండలంలోని తమ్మరాజు పల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూత పడినట్లు తెలుస్తోంది.



మూత పడిన తమ్మరాజుపల్లె విలేజ్ క్లినిక్

2018లో సీహెచ్‌వోల నియామకానికి..

రాష్ట్రంలో సీహెచ్‌వోలను నియమించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆరు నెలల శిక్షణ ఇచ్చి, పరీక్ష పెట్టి సీపీసీహెచ్ సర్టిఫికెట్ వచ్చాక 2019లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా నియమించారు. మొదటి విడతగా 350 మందిని ప్రభుత్వం నియమించింది. ఎక్కువ మాతా శిశు మరణాలు ఎక్కడైతే జరుగుతున్నాయో ఆ ప్రదేశాల్లో ఈకమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ను నియమించారు. 2019 నుంచి విడతలవారీగా సీహెచ్‌వోలను నియమించారు. ప్రస్తుతం 10,032 మంది సీహెచ్‌వోలు విధులు నిర్వహిస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 28వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు.

డిమాండ్లు ఇవే..

ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి. ఎన్‌హెచ్‌వో ఉద్యోగాలతో సమానంగా 2 శాతం వేతన సవరణ చేయాలి. పని ఆధారంగా ప్రోత్సాహకాలను ఇవ్వాలి. ఈపీఎఫ్‌వో పునరుద్ధరించాలి. క్లినిక్ అద్దెబకాయిలు వెంటనే చెల్లించాలి. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నారు.



ధర్నా చేస్తున్న సీహెచ్‌వోలు

చర్చకు సిద్ధం



కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పై ప్రభుత్వంతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర వైద్యశాఖ మంత్రి అందుబాటులో లేక పోవడంతో చర్చలకు పిలవలేదు.

- శివకృష్ణ, జిల్లాఅధ్యక్షుడు

మానవతా దృక్పథంతో స్పందించాలి



సీహెచ్‌వోల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి. 12 రోజులుగా సమ్మె చేస్తున్నాం. ఆధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలి.

- సౌందర్య, వర్కింగ్ ప్రెసిడెంట్

మందులు ఇచ్చే వారేది



గ్రామాల్లో ఉన్న ఆసుపత్రిలో గతంలో మందులు ఇచ్చి రోగాలు నయం చేసేవారు. సమ్మెలో ఉండడంతో మందులు ఇచ్చే వారే కరువయ్యారు. గ్రామంలో ఉన్న వృద్ధులకు సీహెచ్‌వోలే దిక్కు.

- నాగమ్మ, వెలుగోడు

మూతపడితే చర్యలు తప్పవు



సీహెచ్‌వోలు సమ్మెలో ఉన్న కారణంగా విలేజ్ క్లినిక్‌లు ఎక్కడకూడా మూత పడకూడదు. మూతపడితే చర్యలు తప్పవు. క్లినిక్‌లో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలి.

- డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

కృష్ణాతీరానికి అతిథులు

- నేడు వలస పక్షుల దినోత్సవం



సంగమేశ్వర క్షేత్రంలోని కృష్ణాతీరంలో సందడి చేస్తున్న వలస పక్షులు

పక్షులు లేని ప్రపంచాన్ని ఊహించుకోవడం చాలాకష్టం. పక్షులు అంటేనే ప్రకృతి. అంతటి ప్రకృతి అందమైన పక్షులు నల్లమల ప్రాంతాలకు వలస వస్తున్నాయి. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలోని కృష్ణానదీ తీరంతో పాటు రోళ్లపాడు అభయారణ్యం, నల్లమల అటవీ ప్రాంతాల్లోకి ప్రతిఏటా ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు విదేశీ పక్షులతో పాటు దేశంలోని వివిధ విభిన్న ప్రాంతాల నుంచి ప్రతిఏటా వలస పక్షులు సందడి చేస్తున్నాయి. వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి కృష్ణా నదీ తీరానికి చేరుకుంటున్నాయి. ఆహార సేకరణలో అతిథులుగా వచ్చి ఇక్కడే సంతానాన్ని వృద్ధి చేసుకుని తిరిగి స్వస్థలాలకు వెళ్తాయి. కృష్ణానదీ తీరాన వలస పక్షులు ఇలా సందడి చేస్తూ కనిపించాయి. ఇదిలా ఉండగా మే నెలలో రెండో శనివారం ప్రపంచ వలస పక్షుల దినోత్సవంగా 2006లోనే ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.





- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)

భానుడి భగభగలు

- మండుతున్న ఎండలు ● అల్లాడుతున్న ప్రజలు
- అవుకు, పాములపాడులో 41.47డి.సె అత్యధిక ఉష్ణోగ్రత



నిర్మానుష్యంగా నంద్యాల ఎన్జీవోస్ కాలనీ

నంద్యాల ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల పాటు కురిసిన వర్షంతో కాస్త చల్లబడి ఉపశమనం కల్పించగా, శుక్రవారం భానుడు మరోసారి భగ్గుమన్నాడు. ఎండ వేడిమితో ప్రజలు అల్లాడిపోతున్నారు. అవుకు, పాములపాడులో 41.47 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల 40.82, బనగానపల్లె 40.45, పాణ్యం 40.4, రుద్రవరం 40.37, కోవెలకుంట్ల 40.34, బండిఆత్మకూరు 40.06, శిరువెళ్ల 40.05, చాగలమర్రి 39.93, గోస్పాడు 39.79, సంజామల 39.62, గడివేముల 39.59, నందికొట్కూరు 39.52, కొత్తపల్లె 39.49, ఆళ్లగడ్డ 39.45, జూపాడుబంగ్లా 38.96 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

తేలికపాటి వర్షాలు పడే అవకాశం?

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రాబోయే ఐదురోజుల పాటు చిరుజల్లుల నుంచి తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.1డిగ్రీల సెల్సియస్ నుంచి 41.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ సంస్థ వెల్లడించింది. సాయంత్రం, రాత్రివేళ ఉరుములు, మెరుపులు, బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని, ఆ సమయంలో చెట్ల కింద నిలబడవద్దని, పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచవద్దని వాతావరణ సంస్థ సూచించింది.

13న గోరుకల్లు రిజర్వాయర్‌కు అధికారులు

నంద్యాల మున్సిపాలిటీ మే 9 (ఆంధ్రజ్యోతి): సాగునీటి శాఖకు చెందిన సాంకేతిక అధికారులు ఈనెల 13వ తేదీన గోరుకల్లును తనిఖీ చేయనున్నట్లు తెలుగు గంగ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ శివప్రసాదరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీ అధికారుల్లో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన ఐదుగురు ఇంజనీర్లు, స్టేట్ డ్యాం సేఫ్టీ ఆఫీసర్ ఆయనతో పాటు ముగ్గురు ఇంజనీర్లు ఉంటారని చెప్పారు. వీరు గోరుకల్లు రిజర్వాయర్‌ను పరిశీలించి రిజర్వాయర్ పటిష్టతకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారని ఎస్ఈ పేర్కొన్నారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

- 42 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు ● డీఆర్వో రామునాయక్



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో రామునాయక్

నంద్యాల ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో రామునాయక్ తెలిపారు. శుక్రవారం డీఆర్వో కార్యాలయంలో డీవీఈవో సునీత డీఈసీ సభ్యులు రామన్, కృష్ణయ్య, ప్రభాకర్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రామునాయక్ మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను జిల్లాలో 42 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 12వతేదీ నుంచి జరిగే ఇంటర్ పరీక్షలు ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులకు 9గంటల నుంచి 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏఎన్‌ఎంలతో మెడికల్ కిట్స్ ఏర్పాటుచేయాలని వైద్యశాఖ అధికారులను, పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేవిధంగా చూడాలని విద్యుత్ అధికారులను, విద్యార్థుల కోసం సకాలంలో ఆర్టీసీ బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆయన ఆదేశించారు.

మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నంద్యాల నూనెపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఓబులేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) ఎస్సీ, ఎస్టీ కేటగిరికి చెందిన అర్హులైన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సొంత జిల్లాలోనే దరఖాస్తు చేసుకున్న వారు నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సమీపంలో ఉన్న జిల్లా బీసీ కార్యాలయంలో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలన్నారు. తగిన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను జిరాక్స్ కాపీలను జతపరచాలని తెలిపారు.



పొలంలో దహనం చేసినట్టు ఉన్న ఆనవాళ్లు

పోలీస్.. ఇదేం తీరు..!

- గుర్తు తెలియని శవంపై పోలీసుల వైఖరిపై విమర్శలు
- స్పాట్‌కు వెళ్లి.. వదిలేయడంపై అనుమానాలు
- కేసు నమోదు చేయకుండా.. ఫొటోలు డిలీట్?
- గడివేముల పోలీసుల తీరుపై ఆరోపణలు

నంద్యాల/గడివేముల, మే 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పోలీసుల తీరు ఏదో ఒక విధంగా వివాదాలకు దారి తీస్తోంది. పోలీసుల సమన్వయలోపం, వారి నిర్లక్ష్యం తదితర అంశాలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. కేసు ఎలాంటిదైనా సరే నిక్కచ్చిగా వ్యవహరించి నిజాలు వెలుగులోకి తెచ్చి చట్టం దృష్టిలో దోషులుగా నిలబెట్టాల్సిన పోలీసులు.. కనీస ఉద్యోగ బాధ్యతలు కూడా నిర్వహించడం లేదు. తాజాగా గడివేముల మండలంలో ఓ వ్యక్తి మృతికి సంబంధించిన సంఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరు మొత్తం డిపార్ట్‌మెంట్‌కే మచ్చ తెచ్చేలా ఉంది. ఓ వ్యక్తి మృతి ఘటనలో 'ఆ..ఇదంతా మనకెందుకు వచ్చిన తంటా' అనుకున్నారో ఏమో ఆ ఘటనకు సంబంధించిన ఆనవాళ్లు లేకుండా చేసిన వ్యవహారంలో పోలీసులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

పోలీసుల తీరుపై విమర్శలు...

గడివేముల మండలంలో ఓ రైతు తన పొలంలో గత నెల 28వ తేదీన జొన్న పంటను తొలగిస్తుండగా.. గుర్తు తెలియని మానవ అస్థి పంజరం (ఎముకలు, చెప్పులు, ప్యాంట్ తదితర) ఆనవాళ్లు బయటపడ్డాయి. ఈ క్రమంలో కోత మిషన్ డ్రైవర్‌తో పాటు కూలీలు కూడా సదరు అస్థి పంజరాలను చూశారు.

మిగతా 7వ పేజీలో



మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు: కలెక్టర్



నంద్యాల నూనెపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజాకుమారి ఆదేశించారు. శుక్రవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-2025పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు సంబంధిత అధికారులు నివేదికలు సేకరించి పకడ్బందీగా ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. పాఠశాలలు కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగంపై కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల నివారణ కోసం జూన్ 1 నుంచి 26వ తేదీ వరకు సంబంధిత అధికారులు నిర్దేశించిన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు ఫాతిమా, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి రవి కుమార్, డీవీఈవో సునీత, డీఈవో జనార్ధన్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, ఐసీడీఎస్ పీడీ లీలావతి పాల్గొన్నారు.

అశ్వవాహనంపై హోబిలేశుడు
మురళీనాయక్‌ది వీరమరణం 7
దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన మంత్రి ఫరూక్

(5వ పేజీ తరువాయి)

దీంతో వెంటనే సంబంధిత పోలీసులకు రైతు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్పష్టత లేని ఆనవాళ్లు ఉన్నాయని గ్రహించారో..? లేక గుర్తు తెలియని శవం కదా..? భవిష్యత్‌లో మనకెందుకు సమస్య అని వదిలేశారో..? కానీ స్పాట్‌కు వెళ్లి ఎలాంటి కేసు నమోదు చేయకుండా వచ్చేశారు. తర్వాత ఆనవాళ్లతో సహా అస్థిపంజరం కాలిబూడిదైంది. అయితే పోలీసులే ఇలా అస్థిపంజరంతో పాటు ఆనవాళ్లు కూడా లేకుండా చేశారని పలువురు విమర్శిస్తున్నారు. అయితే సంఘటనా స్థలంలో ఆనవాళ్లు, అస్థిపంజరం ఫొటోలను అక్కడ ఉన్న రైతు, ఇతర వ్యక్తుల సెల్‌ఫోన్లను తీసుకుని డిలీట్ చేయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వెలుగులోకి ఇలా...

అస్థిపంజరం, ఇతర ఆనవాళ్ల ఫొటోలను డిలీట్ చేయించినా.. ఓ వ్యక్తి స్ర్కీన్‌షాట్ తీసుకోవడంతో మరో ఫోల్డర్‌లో ఫొటోలు ఉండిపోయాయి. దీంతో ఆ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మృతుడి ఆనవాళ్లను గుట్టుచప్పుడు కాకుండా దహనం చేశారంటూ మండలంలో చర్చగా మారింది. ఈ ఫొటోలు, పోలీసుల వైఖరి రెండు రోజులుగా వైరల్‌గా మారడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో డీఎస్పీతో పాటు మరికొందరు పోలీసులను అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

లోతుగా దర్యాప్తు చేస్తాం



ఎస్‌బీ ద్వారా లోతుగా విచారణ చేస్తాం. ఏదైనా తప్పిదాలు చేసినట్లు తెలిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఈ కేసుపై ప్రత్యేక దృష్టి పెడతాం. గుర్తుతెలియని వ్యక్తి మృతిపై విచారణ చేస్తాం. వైరల్ మారడంతో మా దృష్టికి వచ్చింది. పోలీసులు కూడా వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటాం. ఏ కేసులోనూ నిర్లక్ష్యంగా ఉండకుండా చూస్తాం.
- అధిరాజ్‌సింగ్ రాణా, ఎస్పీ, నంద్యాల

పోలీస్.. ఇదేం తీరు..!



పొలం సమీపంలో రక్తపు మరకలతో ఉన్న వస్త్రం

పోలీసుల తీరు వెనుక...

సాధారణంగా గుర్తు తెలియని శవం, ఆనవాళ్లు లభ్యమైతే వెంటనే పోస్టుమార్టం నిర్వహించి విచారణ చేపడతారు. కానీ ఈ కేసులో గడివేముల పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. గుర్తు తెలియని శవం ఆనవాళ్లు ఉన్నాయని సమాచారం ఇచ్చినా కనీసం విచారణ చేయకుండా చేతులు దులుపుకోవడం వెనుక ఆంతర్యమేమిటో? పైగా ఆనవాళ్లు లేకుండా దహనం కావడం, 'మా పొలంలో ఎలాంటి శవం ఆనవాళ్లు లేవు..' అంటూ పొలం యజమానితో మాట్లాడించడం.. 12 రోజులైనా కేసు నమోదు చేయకపోవడం వంటి అంశాలన్నీ పలు అనుమానాలకు తావిస్తున్నాయి.

మృతుడి వివరాలు తెలిసేదెలా?

గుర్తు తెలియని వ్యక్తి మృతికి సంబంధించి సమగ్ర వివరాలు బయటికి వస్తే.. కొంతవరకు అసలు విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. పోలీసులు స్పాట్‌కు వెళ్లి వెనక్కి ఎందుకువచ్చారు. ఫొటోలను ఎందుకు డిలీట్ చేయించారు? ఆ తర్వాత ఆనవాళ్లు దహనం? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. ఇదిలా ఉండగా ఇద్దరు (ఎస్‌ఐ, కానిస్టేబుల్) పోలీసులు అక్కడికి వెళ్లి.. అక్కడి నుంచి తమ ఉన్నతాధికారికి ఫోన్ చేసిన తరువాత ఈ తతంగం జరిగిందని ప్రచారం సాగుతోంది. ఆనవాళ్లన్నీ మటుమాయం అయ్యాక మృతుడి వివరాలు తెలిసేదెలా? అన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా ఈ వ్యవహారం పోలీసులకు సవాల్‌గానే మారింది. ఈ ఘటనపై పోలీసుల చర్యలు ఏవిధంగా ఉంటాయో వేచి చూడాలి. ఈ ఘటనపై గడివేముల ఎస్‌ఐ నాగార్జునరెడ్డిని వివరణ కోరగా గుర్తు తెలియని వ్యక్తి శవం సమాచారం రావడంతో రైతులను విచారించామని అన్నారు. రైతు తన పొలంలోని వ్యర్థాలను కాల్చి వేస్తుండగా రెండు ఎముకలు కనపడినట్లు తెలిపాడని అన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని అన్నారు.

'పత్తి' సాగుపై దృష్టి

- గతేడాది మంచి దిగుబడులు
- లాభాల బాట పట్టిన అన్నదాతలు
- రాష్ట్రస్థాయిలోనే ఉమ్మడి జిల్లా మొదటి స్థానం
- మేలు రకపు విత్తనాలను అందుబాటులో..

కర్నూలు అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వస్తున్న పత్తి దిగుబడులను చూసి ఈయేడు కూడా రైతులు పత్తిని సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వరుసగా మూడేళ్ల నుంచి పత్తి సాగులో ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లానే మొదటి స్థానాన్ని దక్కించుకుంటోంది. గతేడాది ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో 2.20లక్షల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 30వేల హెక్టార్లలో పత్తి పంట సాగైంది. ఖరీఫ్‌లో వాతావరణం అనుకూలించడంతో ఒక ఎకరాకు 8నుంచి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రైతుల చేతికి అందింది. వ్యాపారులు క్వింటానికి 6వేల నుంచి రూ.6,500 చెల్లిస్తే సీసీఐ సంస్థ రూ.7,520 చెల్లించింది. దీంతో రైతులు పత్తి పంట సాగుతో లాభాల బాట పట్టారు. అందువల్ల రైతులు మరో నెల రోజుల్లో మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌లో పత్తిపంటనే అత్యధికంగా సాగు చేసే అవకాశాలున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ ఏడాది కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 2.70లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతుందని వ్యవసాయాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పత్తిలో అధిక దిగుబడిని ఇచ్చే విత్తన రకాలను వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 25లక్షల ప్యాకెట్లు పత్తి సాగుకు అవసరమవుతాయని అధికారులు అంచనా. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ, డోన్, పాణ్యం, నందికొట్కూరు, నంద్యాల తదితర నియోజక వర్గాల్లో ఇప్పటికే మేలురకం పత్తి విత్తనాల కోసం రైతులు విత్తనాల డీలర్ల వద్ద క్యూ కడుతున్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

ఆదోని అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఆదోని మండలం ఇస్వీ గ్రామం దగ్గర ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 103 కేసుల్లో పట్టుబడిన 1,903 లీటర్లు రూ.8లక్షలు విలువచేసే కర్ణాటక మద్యాన్ని కర్నూలు ఏఈఎస్ పర్యవేక్షణలో సీఐ సైదులు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.

అశ్వవాహనంపై అహోబిలేశుడు



అశ్వవాహనంపై ఊరేగుతున్న నృసింహస్వామి

ఆళ్లగడ్డ, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు అశ్వవాహనంపై ఊరేగారు. ఆలయ మేనేజర్ మాధవన్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామికి ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామి, మణియర్ సౌమ్యనారాయణన్ అభిషేకాలు, నవకలశ తొట్టి తిరుమంజనం నిర్వహించారు. చెన్నైకు చెందిన గోపాల, అహోబిలానికి చెందిన ప్రహ్లాద వరద కైంకర్య సభ, ఆళ్లగడ్డకు చెందిన నాగశేఖర్ ఉభయదారులుగా వ్యవహరించారు. స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బైక్ దొంగలు అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు

కర్నూలు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటారు సైకిళ్లు చోరీ చేసిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ శేషయ్యలు నిందితుల వివరాలు వెల్లడించారు. కర్నూలుకు చెందిన తెలుగు కళ్యాణ్, పెద్దరాజు, షేక్ ఖాజా మొహిద్దీన్‌తో పాటు మరో మైనర్ బాలుడు(నిద్నూరు)లను అరెస్టు చేశారు. నిందితులు కొద్ది కాలంగా నగరంలో పలుచోట్ల మోటారు సైకిళ్లు చోరీచేశారు. నిందితులను అరెస్టు చేసి మూడు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఎనిమిది పల్సర్స్ రెండు స్పెండర్‌ప్లస్, మరో రెండు హోండా మోటారు సైకిళ్లను రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

ఎస్‌ఈ రాజశేఖర్ ఈఎన్‌సీ ఆఫీస్‌కు సరెండర్

కర్నూలు న్యూసిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థలో పని చేస్తున్న సూపరింటెండెంటింగ్ ఇంజనీర్(ఎస్‌ఈ) రాజశేఖర్‌ను ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) కార్యాలయంలో రిపోర్టు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ర్టేషన్ ప్రిన్సిపుల్ సెక్రటరీ సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఈఎన్‌సీ కార్యాలయం నుంచి తక్షణమే రాజశేఖర్ ఎస్‌ఈ రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈతకెళ్లి యువకుడి మృతి

ఉయ్యాలవాడ, మే 9(ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లి యువకుడు మృతి చెందాడు. ఈఘటన గోవిందపల్లె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన షేక్ మాబూ జానీ(25) గ్రామంలో జరుగుతున్న ఉమామహేశ్వర స్వామి పునఃప్రతిష్ఠ ఉత్సవానికి తన బంధువుల ఇంటికి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసుకొని ఆళ్లగడ్డకు చెందిన తన నలుగురు మిత్రులతో కలిసి ఈతకు వెళ్లారు. మాబూజాన్‌కు ఈత రాకపోవటంతో రెండు ప్లాస్టిక్ డబ్బాలను తాడుతో నడుముకు కట్టుకొని బావిలోకి దిగాడు. నడుముకు కట్టుకున్న తాడు తెగిపోవటంతో ఈత కొట్టలేక నీళ్లలో మునిగిపోయాడు. స్థానికులు గుర్తించి గజ ఈతగాళ్ల సాయం తో మృతుడిని బయటకు తెచ్చారు. ఒక్కగానొక్క కొడుకును కోల్పోవ టంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటుకున్నాయి. మృతుడి తండ్రి షేక్ ఖాదర్ వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురళీనాయక్‌ది వీరమరణం

దిగ్ర్భాంతిని వ్యక్తం చేసిన మంత్రి ఫరూక్



నంద్యాల రూరల్ , మే 9 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీరమరణం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. వీరజవాన్ చూపిన ధైర్య సాహసాలు దేశానికే గర్వకారణమన్నారు. ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు మురళీనాయక్ అని మంత్రి కొనియాడారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ'



- ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థికసాయం
- ఉమ్మడి జిల్లాలో 50వేల మందికి ప్రయోజనం
- అర్హుల జాబితాను సిద్ధంచేస్తున్న అధికార యంత్రాంగం

కర్నూలు అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి): కౌలురైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. 'అన్నదాత సుఖీభవ' ద్వారా పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయం ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో ఇస్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా అందిస్తున్న 6వేల మొత్తాన్ని కలిపి రూ.20వేలను రైతులకు అందజేయనున్నారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50వేల మంది కౌలు రైతులు ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారు. ఈ నెలలో ఈ పథకాన్ని రైతులకు అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20వేల చొప్పున సాయం అందజేయనుంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేసే పనుల్లో అధికారులు ఉన్నారు. ఈ నెల 20వ తేదీలోపు ఈ జాబితాను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. సీఎం చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభిస్తారని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు లక్షల మంది రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు అర్హుల జాబితాను తయారు చేస్తున్నారు.

రెండో విడత ఖాళీల భర్తీకి కసరత్తు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

ఆలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మోడల్ స్కూల్ హాస్టళ్లు, కేజీబీవీ స్కూళ్లలో రెండో విడత ఖాళీల భర్తీకి విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. 16 మోడల్ స్కూల్ హాస్టల్స్, 26 కేజీబీవీ స్కూళ్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఐదు నెలల క్రితం విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. కేజీబీవీ, మోడల్ హాస్టళ్లలో 51 నాన్ టీచింగ్, మోడల్ హాస్టళ్లలో 16 పార్ట్ టైం టీచర్లు, ఆరు వార్డెన్ పోస్టులకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. ఇందులో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న వాటిని వదిలి పెట్టి 66 పోస్టులకు గతేడాది నవంబరు 18న నియామకాలు పూర్తిచేశారు. ఇందులో ఐదు హాస్టళ్లకు పార్ట్‌టైం టీచర్లు జాయిన్‌కాలేదు. చాలాచోట్ల నాన్‌టీచింగ్ సిబ్బంది విధుల్లో చేరలేదు. మరి కొంతమంది జాయిన్ అయ్యి వదిలేశారు. ఎక్కడైతే జాయిన్ కాలేదో జాయిన్ అయ్యి వదిలేశారో అలాంటి చోట జాబితాలో తదుపరి అభ్యర్థితో ఆపోస్టును భర్తీచేయాలని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో అధికారులు రెండో జాబితాను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

నియామకాలు త్వరలో పూర్తి చేస్తాం



జిల్లాలో ఖాళీ ఉన్న చోట మొదటి విడత నియామక జాబితాలో తదుపరి అభ్యర్థులతో భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఉన్నత అధికారుల నుంచి కూడా అనుమతి వచ్చింది. ఔట్ సోర్సింగ్ విధానంలో నియామకాలు పూర్తి చేస్తాం.
- శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు

యంత్రంలో పడి రైతు మృతి

కోడుమూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఓరైతు ప్రమాదవశాత్తు మొక్కజొన్న యంత్రంలో పడి మృతి చెందారు. వివరాలివీ.. గ్రామానికి చెందిన మద్దిలేటి (58) హంద్రీ అవతల ఉన్న రెండెకరాల సొంత పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. శుక్రవారం యంత్రం సాయంతో మొక్కజొన్న కోత జరిపించడానికి పొలానికి వెళ్లారు. పంటను యంత్రం కోత చేస్తుండగా, రైతు మద్దిలేటి రాలిపోయిన మొక్కజొన్న కంకులను సంచిలో వేసుకుని తెచ్చి యంత్రంలోకి వేస్తున్నారు. ఈక్రమంలో మొక్కజొన్న కంకులను యంత్రంలో వేస్తుండగా పట్టుతప్పి యంత్రంలో పడ్డారు. దీంతో కాళ్లు యంత్రంలో ఇరుక్కుపోయాయి. ఆ సమయంలో రైతు పెద్దగా అరవడంతో గమనించిన డ్రైవర్ అప్రమత్తమై ఇంజిన్ నిలిపివేశాడు. వెంటనే కిందకు దిగివచ్చి ఇతరుల సాయంతో యంత్రంలో ఇరుక్కుపోయిన మద్దిలేటిని చాలాసేపు శ్రమించి బయటకు తీశారు. అప్పటికే చేరుకున్న 108 వాహనంలో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రైతు మృతి చెందినట్లు తెలపడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మద్దిలేటికి భార్య శివమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడు మద్దిలేటి గాజులదిన్నె ప్రాజెక్టు 10వ నీటిసంఘంలో టీసీ మెంబర్‌గా కొనసాగుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరాలకు అడ్డుకట్ట

కర్నూలు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరాలకు అడ్డుకట్ట వేస్తామని అడిషినల్ ఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో వ్యాస్ ఆడిటోరియంలో ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు, దర్యాప్తు అధికారులు, స్టేషన్ రైటర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, వెంకట్రామయ్య, రామాంజి నాయక్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై సమీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలపై ఆర్‌ఐవో ఎస్వీఎస్ గురువయ్యశెట్టి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నగరంలోని టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు ఆఫీసర్స్, కస్టోడియన్స్‌కు అవగాహన కల్పించారు. మొత్తం 21,324 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీవీఈవో సురేష్‌బాబు, ప్రిన్సిపాల్స్ సుంకన్న, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఈతో కార్పొరేట్ విద్య



ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు

- నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25శాతం సీట్ల కేటాయింపు
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఉచితం
- ఈనెల 15న దరఖాస్తుకు చివరి తేదీ
- జిల్లాలో 3,500 మంది పైగా పేద విద్యార్థులకు అవకాశం

ఆదోని అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యాహక్కు చట్టానికి (ఆర్‌టీఈ) సంబంధించి నోటిఫికేషన్ జారీచేసింది. ఈచట్టం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళిక సిద్ధంచేసింది. జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 3,500పైగా పేదవిద్యార్థులు అడ్మిషన్లు పొందనున్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ యాజమాన్యాలు కోర్టులను ఆశ్రయించి విద్యాహక్కు చట్టం అడ్మిషన్లకు నిరాకరించాయి. ఈసారి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సమగ్రశిక్ష ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో దాదాపు 604ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండగా 25శాతం సీట్లు పేద విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ద్వారా కేటాయించాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం అడ్మిషనులు పొందే విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

దరఖాస్తు ఇలా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్, ఓసీలో విభిన్న ప్రతిభావంతులు, అనాథలు, హెచ్‌ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు ఆర్‌టీఈ ప్రవేశాలకు అర్హులు. ఆయా వర్గాల విద్యార్థులు తమ సమీపంలోని ఐబీ, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌సీ, స్టేట్ సిలబస్ బోధన అందించే ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆధార్, ఇతర ప్రాథమిక వివరాలతో హెచ్‌టీటీపీఎస్//సీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ మే 15 తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలి. అదేవిధంగా సచివాలయాలు, మండల విద్యావనరుల కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారు.

మంచి అవకాశం

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. పేద విద్యార్థులకు ఇది మంచి అవకాశం. కార్పొరేట్ పాఠశాలలలో వారు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. తల్లిదండ్రులు ఈనెల 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే 1200మందికి పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి.
- శామ్యూల్ పాల్, డీఈవో, కర్నూలు

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన నేతలు

కర్నూలు, మే 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పర్యటన ముగించిన కర్నూలు విమానాశ్రయానికి వచ్చిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతపురం నుంచి హెలికాఫ్టర్‌లో ఓర్వకల్లు మండలంలోని విమానాశ్రయానికి వచ్చిన చంద్రబాబుకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎంపీ, ఎమ్మెల్యేలు నాగరాజు, గౌరు చరిత, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అధికారులు ఘన స్వాగతం పలికారు.



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

జవాన్ మరణం బాధాకరం

నంద్యాల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్ పాకిస్తాన్ యుద్ధ జరుగుతున్న యుద్ధంలో జవాన్ మురళీనాయక్ మృతి చెందడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పుట్టగుండ్లపల్లికి చెందిన మురళీనాయక్ దేశం కోసం వీరమరణం పొందడాన్ని యావత్ భారత ప్రజలు నివాళులు అర్పిస్తున్నారన్నారు.

'ఉగ్రవాదాన్ని అంతం చేయాలి'

నంద్యాల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శుక్రవారం ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ సామాన్యుల ప్రాణాలను ముప్పు లేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో ఉగ్రవాదాన్ని అంతం చేయాలని కోరారు. పహల్గాం ఉగ్రవాదానికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన కార్యక్రమానికి ప్రతి భారతీయుడు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

సైనికుల క్షేమం కోసం పూజలు

నంద్యాల కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేసిన భారత సైన్యం క్షేమంగా ఉండాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులు సుభిక్షంగా ఉండాలని కాళీమాత అమ్మవారికి అఖండ మహా మంగళహారతి ఏర్పాటుచేసి జవానుల విజయం కోసం ధ్యానం చేశారు. కార్యక్రమంలో కాళీమాత సేవాసమాజం భక్తులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ న్యాయవాదులకు ప్రత్యేక శిక్షణ

నంద్యాల క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ న్యాయవాదుల కోసం ప్రత్యేక శిక్షణా తరగతులు శనివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నారు. కోర్టు కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లోని నూతన బార్ అసోసియేషన్ భవనంలో ఈ తరగతులు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కె. సాయిస్వరూప్ ప్లీడింగ్ అండ్ ప్రాక్టీస్ అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నారు. నూతన న్యాయవాదులకు ఇది మంచి అవకాశమని పేర్కొంటూ అందరూ హాజరై ప్రయోజనం పొందాలంటూ బార్ అసోసియేషన్ కార్యవర్గ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమాన్ని బార్ అసోయేషన్ అధ్యక్షులు కె.హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షుడు బీఎన్‌వీ సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్. క్రిష్ణారెడ్డి, ట్రెజరర్ ఎస్. మద్దిలేటి రెడ్డి, జాయింట్ సెక్రటరీ వి.బాలు నాయక్, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రటరీ డి. చిన్న లింగమయ్య, లైబ్రేరియన్ సెక్రటరీ జి. మద్దిలేటి యాదవ్, మహిళా ప్రతినిధి ఐ. సౌజన్య సమన్వయంతో నిర్వహిస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నంద్యాల టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల పురపాలక సంఘంలో పని చేస్తున్న రెగులర్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు, చెప్పులు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారికి పురపాలక చైర్ పర్సన్ మాబున్నీసా చేతుల మీదుగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ 85 మందికి అందజేసినట్లు తెలపారు. శానిటేషన్ సూపర్‌వైజర్ మురళి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పాములపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): పాములపాడులోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏసీడీపీవో మంగవల్లి, డీసీపీవో ప్రియదర్శిని సుప్రియ శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ కిశోర వికాసం, వేసవి సెలవులలో చేపట్టే కార్యక్రమాలు, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి, అంగన్‌వాడీ టీచర్లు శివలక్ష్మి, నామణి, నాగమ్మ, నాగమద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



చిన్నదేవళాపురంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

బండిఆత్మకూరు, మే 9(ఆంధ్రజ్యోతి): కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని చిన్నదేవళాపురం, నారాయణపురం, సంతజూటూరు గ్రామాల్లో బాలికలకు కిషోరి వికాసం సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహానంది, మే 9 (ఆంధ్రజ్యోతి): గోపవరం గ్రామంలో గత నెల 30వ తేదిన ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడిన కొమ్ము సర్వన్న (41) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలివీ.. రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామానికి చెందిన కొమ్ము సర్వన్న తన అత్తగారి ఊరైన మహానంది మండలం గోపవరం గ్రామానికి భార్య, పిల్లలతో కలసి గత నెల 29 వతేదిన వచ్చారు. 30 వతేది సాయంత్రం గాలి,వాన వస్తుండటంతో ఇంటిపైన గడ్డి కట్టలు ఉండటంతో వర్షానికి నానిపోకుండా ప్లాస్టిక్ కవర్ కప్పడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ సర్వన్నను కుటుంబ సభ్యులు చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తి అదృశ్యం

గడివేముల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బొల్లవరం గ్రామానికి చెందిన గువ్వల రాజు అదృశ్యమైనట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కె.బొల్లవరం గ్రామానికి చెందిన రాజు గడివేములలో నివాసం ఉంటూ జీవాలు మేపుకునేవారు. గత 14 రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను గడివేములలోని ఓ మొబైల్ దుకాణంలో చార్జింగ్ పెట్టుకోవడం కోసం ఇచ్చారు. అప్పటి నుంచి గ్రామంలో కనిపించడం లేదు. ఆయన సోదరుడు జనార్దన్ రాజు ఆచూకీ కోసం బంధువుల ఇళ్లల్లో గాలించారు. అయితే ఆచూకీ తెలియకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

13న జాబ్ మేళా

నంద్యాల ఎడ్యుకేషన్, మే 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఉపాధికల్పనశాఖ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నేషనల్ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూలసాగరం జ్ఞానాపురంలోని నేషనల్ ఐటీఐ కళాశాలలో 13వతేదీ మంగళవారం టాటా క్యాపిటల్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు వారి విద్యార్హతలకు సంబంధించిన పత్రాలు, ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు.

'ఘర్షణలకు దూరంగా ఉండాలి'

బండిఆత్మకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉండాలని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని బి.కోడూరు గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. నేరాల అదుపునకు ప్రజల సహకరించాలని కోరారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'గోరుకల్లు'పై నిర్లక్ష్యం

- పెండింగ్‌లో 10 శాతం పనులు
- రిజర్వాయర్‌కు రూ.200 కోట్లు అవసరం ఉండగా వైసీపీ పాలనలో రూ.99 కోట్లకే ప్రతిపాదనలు
- ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరయ్యేనా?
- రైతుల ఎదురుచూపులు



గోరుకల్లు రిజర్వాయర్



రిజర్వాయర్ రెగ్యులేటర్

నంద్యాల మున్సిపాలిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ సాగు నీటి ప్రాజెక్టులపై వ్యవహరించిన నిర్లక్ష్య ధోరణి గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి శాపంలా మారింది. వైసీపీ తీరు వల్ల ఎస్సార్బీసీ ఆయకట్టు రైతన్న కొన్నేళ్ల పాటు తనకు దక్కాల్సిన సాగునీటి హక్కును కోల్పోయాడు. నంద్యాల, కడప జిల్లాలకు లక్షా 90 వేల ఎకరాలకు నీరందించటానికి 2004లో ప్రతిపాదిత నిర్మాణంతో ప్రారంభమైంది. అంచనా వ్యయం రూ.617 కోట్లతో నిర్మాణం ప్రారంభం కాగా.. ఆ తర్వాత అంచనా వ్యయం రూ.854 కోట్లకు చేరుకుంది. అయితే ఇంకా రూ.200 కోట్లు నిధులు మంజూరైతేనే వంద శాతం పనులు పూర్తవుతాయి. గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణాలను ప్రసాద్ అండ్ కంపెనీతో పాటు ఎస్ఈడబ్ల్యూ కంపెనీలు జాయింట్ వెంచర్‌తో చేపట్టాయి. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాకపోవటం వెనుక సీమ ప్రజల పట్ల ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నా ప్రధానంగా గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాకపోవటం వెనుక వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పట్ల ప్రదర్శించిన నిర్లక్ష్య ధోరణే ప్రధాన కారణం.

పలు ప్రాజెక్టులకు ఆధారం

గోరుకల్లు రిజర్వాయర్ పూర్తి నిల్వ సామర్థ్యం 13 టీఎంసీలు. ఈ రిజర్వాయర్ ద్వారా అవుకు, గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి రిజర్వాయర్లకు నీరు సరఫరా అవుతుంది. శ్రీశైలం రిజర్వాయర్‌కు వచ్చే వరద నీటిని పోతిరెడ్డి పాడు రెగ్యులేటర్ ద్వార గోరుకల్లు రిజర్వాయర్‌ను నింపుతారు. వర్షా కాలంలో బైపాస్ కెనాల్ ఆయకట్టుకు సాగునీరందిస్తారు. వర్షాలు ముగిశాక రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న వరద నీటితో ఎస్సార్బీసీ ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రిజర్వాయర్ పనులు పూర్తి స్థాయిలో జరగకపోవటంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో 11 టీఎంసీల నీరు నింపుతున్నారు. 13 టీఎంసీల సామర్థ్యం మేరకు నిర్మాణ పనులు పూర్తి కాకపోవటంతో నంద్యాల, కడప జిల్లాలో సుమారు 25 వేల ఎకరాలకు నీరందించలేని దుస్థితి నెలకొనింది

రూ. 200 కోట్ల పనులు పెండింగ్

గోరుకల్లు రిజర్వాయర్ పూర్తి నిల్వ సామర్థ్యం 13 టీఎంసీలకు చేరుకోవాలంటే రూ. 200 కోట్లు కావాలని గోరుకల్లు డివిజన్ అధికారులు పేర్కొంటున్నారు. నిర్మాణ సమయంలో తలెత్తిన పలు సాంకేతిక ఇబ్బందుల కారణంగా రిజర్వాయర్‌ను పూర్తి నిల్వ సామర్థ్యంతో నిర్మించలేదు. దీనికి తోడు వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పలు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసినట్లు గోరుకల్లు రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేసింది. ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టిన ప్రసాద్ అండ్ కంపెనీతో పాటు ఎస్ఈడబ్ల్యూ కంపెనీలు తాము రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేయలేమని 2020లో వైసీపీ ప్రభుత్వానికి విన్నవించుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 200 ప్రాజెక్టుల నిర్మాణాలను రద్దు చేసింది. అందులో భాగంగా గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణాన్ని కూడా నిర్లక్ష్యం చేసింది.



ఏప్రిల్ 25న కుంగిన కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

రూ. 99 కోట్లకు మాత్రమే ప్రతిపాదనలు

రిజర్వాయర్ నిర్మాణానికి రూ.200 కోట్లు అవసరమైనప్పటికీ అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో అంచనాలను కుదించి రూ. 99 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు విడుదలైతే తద్వార చేపట్టే బండ్ నిర్మాణం వల్ల రిజర్వాయర్ లో పూర్తి స్థాయి నీటి మట్టాన్ని నింపటంతో పాటు అదనంగా 25వేల ఎకరాల సాగునీరు అందుబాటులో ఉంటుందని గోరుకల్లు ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

కుంగిన కట్ట

రిజర్వాయర్ బండ్ కుంగిపోయింది. దీంతో కుంగిపోయిన బండ్‌ను ఎమ్మెల్యే గౌరు చరిత ఏప్రిల్ 25న పరిశీలించారు. తక్షణ పనుల నిమిత్తం డీఎంఎఫ్‌వో నిధులను కలెక్టర్ ద్వారా మంజూరు చేయించారు.

90 శాతం పనులు పూర్తి

రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టిన ప్రసాద్ అండ్ కంపెనీతో పాటు ఎస్ఈడబ్ల్యూ కంపెనీలు 91 శాతం పనులు పూర్తి చేశాయి. అతి ముఖ్యమైన10 శాతం పనుల సమయంలో పనులను విరమించుకున్నాయి. కేవలం 10 శాతం పనులు పూర్తైతే గోరుకల్లు పూర్తి స్థాయి సేవలు అందిస్తుంది. రిజర్వాయర్ బండ్ సైతం కొంత మేర కుంగింది. సుమారు 5 సంవత్సరాలుగా పెండింగ్ పనుల పూర్తికి వైసీపీ ప్రభుత్వంలో వరుస ప్రతిపాదనలు పంపాము కానీ ఫలితం శూన్యం. నిధులు విడుదలైతే పెండింగ్ పనులు పూర్తి చేసి పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందించవచ్చు.

- శుభకుమార్, ఈఈ

సమస్యలు పరిష్కరించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు
- సమాధానాలు చెప్పిన అధికారులు



మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్రమ్మ

పాములపాడు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామంలో విద్యుత్ సిబ్బంది సరిగా పని చేయడం లేదని, కరెంట్ స్తంభాలకు డబ్బులు అడుగుతున్నారని సర్పంచ్ మౌళాలి మండల విద్యుత్ అధికారి హబీబ్‌ను ప్రశ్నించారు. శుక్రవారం పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీపీ సరోజినీ వర్ధీనియా అధ్యక్షతన ఎంపీడీవో చంద్రశేఖర్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. అధికారుల సమాధానాలతో వాడీవేడిగా కొనసాగింది. మండలంలోని రుద్రవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-2నకు ప్రహరీ నిర్మించాలని సర్పంచ్ రామస్వామి కోరారు. హైవే నిర్మాణం నేపథ్యంలో పొలాలకు రహదారి మూసుకుపోతున్నాయని, హైవే అధికారులతో మాట్లాడి దారులు ఉండేలా చూడాలని కో ఆప్షన్ మెంబర్ ముర్తుజావలి తహసీల్దార్ సుభద్రమ్మను కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు చేసుకోవాలని, మండలంలో మిట్టకందాల, కంబాలపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న రీ సర్వే పనులకు రైతులు సహకరించాలని కోరారు. పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, షూస్, తదితర వస్తువులు వచ్చాయని తెలిపారు. అలాగే రుద్రవరం గ్రామంలో నేషనల్ హైవే పనుల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలను కూల్చివేశారని, అందుకు గానూ రూ. 64 లక్షల పరిహారం అందిందని తెలిపారు. నూతన పాఠశాల భవన నిర్మాణం గ్రామంలో చేపట్టాలంటే స్థలం లేదని, దాతలు ఎవరైనా స్థలం కేటాయిస్తే పాఠశాల నిర్మాణానికి డబ్బులు ఉన్నాయని తెలిపారు. మండలంలోని పలు అంశాలపై చర్చలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ ఏసీడీపీవో మంగవల్లి, వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీవో అలివేలు మంగమ్మ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సమావేశం



సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

గడివేముల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమద్దమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. మండల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరవడంతో ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. గత సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఇంకా పరిష్కరించలేదని అన్నారు. ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ వెంకటరమణ, జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో హేమసుందర్‌రెడ్డి, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

నంద్యాల టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నంద్యాల, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, డోన్ అన్ని సబ్ డివిజన్‌ల్లో గురువారం రాత్రి పోలీసులు ముమ్మర తనిఖీలు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు రాత్రి 11 గంటల సమయంలో జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. అనుమానస్పద వ్యక్తులు, వాహనాలు, లాడ్జీలు, బస్టాండు, రైల్వే స్టేషన్, బార్డర్ చెక్‌పోస్టులు, ఇలా అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో త నిఖీలు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం, కలగకుండా అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. ఎక్కడైనా అనుమాస్పద వ్యక్తులు, గానీ ఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఆత్మకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఎల్ఐసీ యూనియన్ నాయకులునాగన్న, ఎన్జీవోస్ అసోసియేషన్ తాలుకా సహాయ కార్యదర్శి రాజశేఖర్, బ్యాంకు యూనియన్ నాయకులు అంజనేయలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహంచారు. వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

- బేతంచెర్ల మండలంలోని సిమెంట్ నగర్ గ్రామ సచివాలయం వద్ద జరిగిన వీవోఏల నియామక విషయంలో వివాదానికి కారణమైన ఏపీఎం మధు, సీసీ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. ఈ శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వీవోల పోస్టుల నియామకంలో తమ అనుయాయులకు ఇప్పించేందుకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు.

'ఉపాధి కూలీల వేతనాలు పెంచాలి'

ఆత్మకూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని కరివేన గ్రామంలో జరుగుతున్న పని ప్రదేశాలలో పర్యటించి మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేయూపీఎస్ నాయకులు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మౌళాలి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు

నంద్యాల కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని మూలమఠంలో వెలసిన భీమేశ్వరస్వామి దేవస్థానం, అయ్యలూరు గ్రామంలో వెలసిన నీకంఠేశ్వర, కోదండ రామస్వామి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయాల ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. ఒక్కొక్క దేవస్థానానికి 9 మంది సభ్యులు మించకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 25వ తేదీ సాయంత్రం 5గంటలలోగా జిల్లా దేవదాయ శాఖ అధికారి, దేవదాయ శాఖ, రైతునగరం, నంద్యాల వారి కార్యాలయానికి పంపించాలన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల ఆలయ పాలక మండళ్ల నియామకానికి రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారని, దరఖాస్తు చేసుకోవాలని ఈవో ఆకృతి నాగప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పెద్దదేవళాపురం వరదరాజ, ఆంజనేయ, లింగమయ్య స్వామి, బండిఆత్మకూరు లక్ష్మీజనార్దన, ఆంజనేయస్వామి, ఈర్నపాడు, చెన్నకేశవ, ఈశ్వర, కోదండరామస్వామి, శింగవరం వెంకటేశ్వర, ఆంజనేయస్వామి, సంతజూటూరు చెన్న కేశవ, ఆంజనేయ స్వామి, భోజనం గ్రామం ముక్తేశ్వర, కడమలకాల్వ చెన్నకేశవస్వామి ఆలయ పాలక మండళ్లకు ఆసక్తి కల్గిన వారు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఆలయానికి 9 మందికి మించకుండా సభ్యులు ఉండేలా దరఖాస్తులను పూరించి నంద్యాల మండలం రైతు నగరం సమీపంలోని జిల్లా దేవాదాయ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఏవో తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడి

జూపాడుబంగ్లా, మే 9(ఆంధ్రజ్యోతి): సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడులు సాధించవచ్చని రైతు శిక్షణ కేంద్రం ఏవో హేమలత అన్నారు. మండలంలోని తంగడంచ గ్రామ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారి కృష్ణా రెడ్డి అధ్యక్షతన అధికారి హేమలత భూసార పరిక్షల మీద శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తంగడంచ గ్రామ ఉద్యాన సహాయకులు వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీలో అవకతవకలు



పేరు లేదని పత్రాలు చూపుతున్న బాధితుడు

నంద్యాల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో తన పేరు లేదని నంద్యాల పట్టణంలోని వీసీ కాలనీ చెందిన షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. వీసీ కాలనీకి చెందిన జమాల్‌బీ, చిన్నగఫూర్ బాషాకు నలుగురు సంతానం. ముగ్గురు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. అయితే ఇటీవల జమాల్ బీ చనిపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక సచివాలయంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశారు. అయితే అందులో పెద్ద కుమారుడైన షేక్ ఖాదర్‌బాషా పేరు లేకుండా ముగ్గురు సంతానం అని మాత్రమే ఇచ్చారు. దీంతో బాధితుడు వీఆర్వోను అడగగా నేను విచారణ చేసి తహసీల్దార్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. అయితే అక్కడ ఏమీ జరిగిందో కానీ పేరు లేకపోవడంతో తను కుటుంబానికి సంబంధం లేదని వారు అంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ప్రియదర్శినిని వివరణ అడగగా దరఖాస్తు చేసుకున్న వ్యక్తి అందులో కేవలం మూడు పేర్లు మాత్రమే సంతానం రాయడంతో ఇచ్చామన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- గ్రీవెన్స్‌కు గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



రైతులకు సబ్సిడీ పనిముట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

మిడుతూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మిడుతూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీ సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 40 శాతం సబ్సిడీ, 50 శాతం సబ్సిడీ కింద వచ్చిన వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే వ్యవసాయాధికారి పీరు నాయక్ ఆధ్వర్యంలో రైతులకు అందజేశారు.

- మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు గుండం సర్వోత్తమరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, సధాకర్ రెడ్డి, రమణ రెడ్డి, బాషా, నరసింహగౌడు, నాగేంద్రుడు, చాకర్‌వలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగ సంస్కరణలతో గందరగోళం'



ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల నూనెపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యారంగంలో సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గందగోళ పరిస్థితులను నెలకొల్పిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ , ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజ నాలకై ఎపీటీఎఫ్ రాష్ట్ర సమితి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. రవికుమార్‌తో పాటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలు నెలకొల్పితే ఈ ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేఖిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1 నుంచి 5 తరగతులకు వరకు మోడల్ ప్రాథమిక పాఠశాలలు, బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగించాలని డిమాండు చేశారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో తరగతులను బట్టి స్కూల్ అసిస్టెంట్ పోస్టులు జీవో నెం 55 ప్రకారం కొనసాగించాలని డిమాండు చేశారు. ఆంగ్ల మాధ్యమానికి సమానంగాతెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని , సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతి కొనసాగించాలన్నారు. బదిలీలు, పదోన్నతులకు మాన్యువల్ కౌన్సెలింగ్ విధానాన్ని కొనసాగించాలని 12వ పీఆర్సీ వెంటనే నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండు చేశారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 14వ తేదిన విజయవాడలోని ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. డీఆర్వో రామునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు బాస్కర్‌రెడ్డి, జాకీర్‌హుసేన్, మధు, రమేశ్, శైలజ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం: పీడీ

గోస్పాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తిస్థాయి వేతనం రూ300 వస్తుందని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం పసురపాడు, శ్రీరాంనగర్ గ్రామాలలో ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో గంగన్న, టీఏ నాగేశ్వరి, ఎఫ్ఏ రమేష్‌యాదవ్ ఉన్నారు.

'నూతన గేట్ల ఏర్పాటుకు చర్యలు'

పాములపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ వద్ద నూతన గేట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఏఈఈ దేవేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాత ఎస్సార్బీసీ, వీబీఆర్, కేసీసీ, ఎస్కేప్ చానల్ గేట్ల ఏర్పాటుకు రూ. 15 కోట్లతో ప్రణాళికలు సిద్ధ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేసీసీ, ఎస్కేప్ చానల్ నిర్మాణపు పనులు 5 కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం హైదర్‌బాద్‌లో సిద్ధం చేసిన గేట్లను సీఈ కబీర్‌బాషా పరిశీలించారని, త్వరగా అమర్చి జూన్ చివరి నాటికి పనులు పూర్తిచేసి ఖరీఫ్‌కు నీటిని విడుదల చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం



చెన్నకేశవస్వామి కల్యాణం జరుపుతున్న వేద పండితులు

చాగలమర్రి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు కల్యాణం వేద పండితుల ఆధ్వర్యంలో అత్యంత కమనీయంగా సాగింది. ఉభయదారులతో ఉత్సవమూర్తులకు తాళి కట్టించి తలంబ్రాలు పోయించారు. దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవో వెంకటరమణ, కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు మాధవాచార్యులు, శేషాచార్యులు, మహిళలు పాల్గొన్నారు.

శేషవాహనంపై స్వామివార్లు

వెల్లాల క్షేత్రంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నకేశవ, సంజీవరాయస్వామి శేషవాహనంలో కొలువుదీరింప చేసి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22న హనుమజ్జయంతి

డోన్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని ఈ నెల 22న గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త టీఈ కృష్ణాంజనేయులు గౌడు, అర్చకులు ఏపీ లక్ష్మణ కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని కొండపైన వెలసిన తిరుమల వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి సుప్రభాతం, పంచామృతాభిషేకం, ఆకుపూజలు, విశేష అలంకరణ, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.శేషన్నగౌడు, టీఈ సుధాకర్‌గౌడు, జి.నాగేశ్వరరావు, మాణిక్యప్రభు సేవా సమితి, ఒంటెద్దు బండి కిరణ్ పాల్గొన్నారు.

రేపు మహిళలకు పోటీలు

డోన్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్నర్‌వీల్ అధ్యక్ష కార్యదర్శులు మద్దమ్మగౌడు, శకుంతలారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ లోని ఇన్నర్ వీల్ క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. మహాలక్ష్మి నర్సింగ్ హోం ఆర్థిక సౌజన్యంతో డాక్టర్ బాలచంద్రారెడ్డి, డాక్టర్ అనితా రెడ్డి సౌజన్యంతో తల్లులకు ఉదయం 5.30 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సప్త శైలరాజేష్ బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. సమావేశంలో మర్రి సరళాదేవి, రాజా సుజాత, సప్తశైల సుమిత్ర, శైలజారెడ్డి, రాధారెడ్డి ఉన్నారు.

రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

కోవెలకుంట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరుకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేసిందని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరూ రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజ చేస్తున్న అర్చకులు

బనగానపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. పట్టణంలోని నేలమఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శత నామ పూజలు కుంభ హారతులతో నివేదన కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదానం చేసినట్లు పూజారి శ్రీనివాసాచార్యుల తెలిపారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మే 8 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చౌడేశ్వరికి..

రుద్రవరంలో కొలువుదీరిన చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ



నందవరంలో పల్లకీసేవలో చౌడేశ్వరీమాత

బనగానపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వ ర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



బాబా ఆలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు

ప్యాపిలి, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయలంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఉయ్యాలవాడ, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లెలో ఉమామహేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. నవ విగ్రహాల గ్రామోత్సవం కొనసాగింది. సాయంత్రం శృంగేరి శివగంగా పీఠాధిపతి ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రారంభించారు. ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చామల చంద్రశేఖర్‌రెడ్డి, గడ్డం దస్తగిరిరెడ్డి, కమిటీ సభ్యులు ఆరికట్ల శివారెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, బోరెడ్డి నర్శిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అవుకు: పట్టణంలోని కోట వీధిలో వెలసిన భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు స్వాముల వారిని పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. రాత్రికి సంకల్పం, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, అంకురార్పణ, కలశస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు స్వామివారి కల్యాణం

ఆలయంలో శనివారం ఉదయం 8 గంటలకు శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి తిరు కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు, మాంగళ్యం, తలంబ్రాలు సమర్పించనున్నారు.



చెన్నకేశవ స్వామి

పాండురంగ విఠలేశ్వరస్వామి కల్యాణానికి

ముత్యాల తలంబ్రాల సమర్పణ

కోవెలకుంట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పెండేకంటి దంపతులు ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులతో కలిసి పాండురంగ విఠలేశ్వరస్వామి దేవాలయం చేరుకుని పండితులు సంబటూరు వేణుగోపాలచార్యులు సంబటూరు సుదర్శనాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం తెల్లవారుజామున జరిగే పాండురంగ విఠలేశ్వరస్వామి కళ్యాణానికి ముత్యాలతలంబ్రాలు, గాజులు, పసుపు కుంకుమలను దంపతులు సమర్పించారు. కార్యక్రమంలో పెండేకంటి నాగరాజు, సనత్‌కుమార్, సత్యనారాయణ, శేషఫణి, యువజన సంఘం నాయకులు కర్నాటి అభిలాష్, మహిళామండలి అధ్యక్షురాలు లింగాల వందన, గూడూరు గురుదేవి ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.



ముత్యాల తలంబ్రాలను తీసుకువస్తున్న మహిళలు

చట్టాలపై అవగాహన ఉండాలి

దొర్నిపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. శుక్రవారం దొర్నిపాడు గ్రామంలో కిషోర వికాసం, వేసవి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా కిషోర బాలికలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం జూన్ 10వరకు కొనసాగుతుందని అన్నారు. మహిళలకు బాలల హక్కుల చట్టం గురించి, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే రంజిత్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కిషోర బాలికలు ఉన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

బేతంచెర్ల: సమాజంలో బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్‌టీసీ దుర్గయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పమ్మ అన్నారు. శుక్రవారం బేతంచెర్ల పట్టణం, సిమెంటునగర్ అంగన్‌వాడీ సెంటర్లలో కిషోర వికాసం కౌమార బాలికల సాధికారత, బాలికలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌లపై ఏఎన్‌ఎం రేణుక, పరీదాబాను ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌టీసీ పీవో దుర్గయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు కిషోర బాలికలకు సెల్‌ఫోన్లు సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచడం చాలా మంచిదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గుల్జార్‌బీ, నారాయణమ్మ, విజయలక్ష్మి, ఆర్.అంజలి, ఎంకే నాగలక్ష్మి, మహాలక్ష్మి, రోజా, బాలికల తల్లులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ

వర్క్‌షాపును జయప్రదం చేయాలి

డోన్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సుధ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఈ నెల 11న నిర్వహించనున్న జన విజ్ఞాన వేదిక ప్రాంతీయ వర్క్‌షాపును జయప్రదం చేయాలని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి కోరారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన జన విజ్ఞాన వేదిక కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీలు బాల సుబ్రహ్మణ్యం, గేయానంద్ హాజరవుతారని తెలిపారు. రాయలసీమ జిల్లాల జేవీవీ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. నాయకులు సర్వజ్ఞమూర్తి, లతీఫ్, రామ్మూర్తి, ఎంఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు సన్మానం

డోన్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు శుక్రవారం సన్మానించారు. స్థానిక ఇన్నర్ వీల్ భవనంలో ప్రభుత్వ కేవీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో ఐదు మంది విద్యార్థులు బి.విజయలక్ష్మి (590/600), వై.శశికళ (587), టి.మౌనిక (578), టి.హారిక (574), టి.జశ్విత (557) ఉత్తమ మార్కులు సాధించారు. విద్యార్థులను సన్మానించి షీల్డ్ బహూకరించారు. కార్యక్రమంలో సభ్యులు నాగభూషణం రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి, జగన్మోహన్, కుళ్లాయప్ప, శ్రీధర్ భట్టు, ఎలుకూరు నరేష్, సర్వజ్ఞమూర్తి, గంగిరెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసులు, గంగిశెట్టి రమణయ్య, ఉపాధ్యాయురాలు ఉమాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భిన్న వాతావరణం

- ఓవైపు ఎండలు .. మరో వైపు వానలు
- జిల్లా ప్రజల ఉక్కిరి బిక్కిరి

కొలిమిగుండ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులతో జిల్లా ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఓవైపు ఎండలు.. మరోవైపు వానలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. పగలంతా భానుడు భగ భగ మండుతూ జిల్లాలో 42 డిగ్రీలకు పైగా ఎండలు నమోదవుతుండగా, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అదే సమయంలో సాయంత్రం మయ్యేసరికి వాతావరణం పూర్తిగా మారిపోయి, ఉరుములు, మెరుపులతో, గాలివాన బీభత్సం సృష్టిస్తోంది. మరికొద్ది రోజులు వాతావరణ అనిశ్చితి ఇలాగే ఉండే అవకాశం ఉందని, విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిస్తుండటంతో ప్రజల్లో మరింత ఆందోళన నెలకొంది. జిల్లాలో విస్తారంగా సాగుచేసిన అరటి, మొక్కజొన్న, మిర్చి, వరి తదితర పంటలు ఈదురు గాలులు వర్షాల కారణంగా పెద్ద ఎత్తున దెబ్బతిని అన్నదాతలకు తీవ్ర ఆవేదనను కలిగిస్తున్నాయి. దీంతో ఓవైపు ఎండలు .. మరోవైపు వానలు తీవ్ర నష్టాలనే మిగుల్చుతున్నాయని రైతులు, ప్రజలు వాపోతున్నారు.

ఎటూ చూసినా చెత్తాచెదారం

- ఇబ్బందుల్లో ఎస్సీ బృందావనకాలనీ ప్రజలు
- పట్టించుకోని అధికారులు



వీధిలో పడేసిన చెత్తాచెదారం

ఆళ్లగడ్డ, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ బృందావన కాలనీలో చెత్తాచెదారం పేరుకు పోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో 130 కుటుంబాల వారు నివాసముంటున్నారు. వారం రోజులుగా మున్సిపల్ సిబ్బంది చెత్తా తీసుకపోవడంతో కుండీల్లో పేరుకుపోయింది. వారం రోజులుగా వీధులను శుభ్రం చేయడం లేదని, కాలనీకి ఇద్దరు స్వీపర్లను ఏర్పాటు చేసినప్పటికీ వారు రావడం లేదని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయాన్ని మున్సిపాలిటీ అధికారులకు తెలియజేసిన ఫలితం లేకుండాపోయిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వంతెన నిర్మాణానికి మోక్షమెన్నడో!

- ప్రతీ ఏటా ఉప్పొంగుతున్న అడ్డవాగు
- ఏళ్లగా వంతెన కోసం రైతులు, కూలీలు ఎదురుచూపు

చాగలమర్రి, మే 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామ సమీపంలోని గోపాయ పల్లె రహదారిలో గల అడ్డవాగుకు వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడోనని రైతులు, కూలీలు ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో అడ్డవాగు వరద నీరు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. వాగు సమీపంలో రెండు వేల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంట పొలాలను నమ్ముకొని సుమారు 800 మంది రైతులు, కూలీలు జీవిస్తున్నారు. వర్షపునీరు, టీజీపీ లీకేజీ నీరు కలిసి అడ్డవాగుకు చేరడంతో రైతులు వాగు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డవాగుపై వంతెన నిర్మించకపోవడంతో 16 ఏళ్ల నుంచి రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ అడ్డవాగుపై వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఆమె హామీ మేరకు పీఆర్ ఏఈ కొండారెడ్డి రూ.20 లక్షలతో వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించారు. అయితే పనులకు నోచుకోలేదు. ప్రతి ఏడాది వర్షాకాల సమయంలో వాగు దాటేందుకు రైతులు, కూలీలు నరకయాతన పడుతు న్నా రు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ రావడంతో తమ కష్టాలు తీరుతాయని రైతు లు, కూలీలు ఎదురు చూస్తున్నారు. వర్షా కాలం వచ్చేలోపు నీరు లేక ఒట్టిపోయిన అడ్డవాగు వంతెన పనులు చేపట్టి తమను ఆదుకోవాలని రైతు లు, కూలీలు కోరుతున్నారు.



చాగలమర్రిలో అడ్డవాగు నుంచి సాగు భూములకు వెళ్తున్న కూలీలు



చాగలమర్రిలో నీరు లేక ఒట్టిపోయిన అడ్డవాగు

అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలి



సీనియర్ అసిస్టెంట్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

డోన్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు టి.శివరాం, ఏవీ.భాస్కర్ రెడ్డి, అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సులోచన, సుమలత, యశోదలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగన్నకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారత కార్మిక సంఘాలు, ఏఐ ఎఫ్‌డబ్ల్యూహెచ్, స్వతంత్ర ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

హడలెత్తించిన కొండ చిలువ



భారీ కొండచిలువ

రుద్రవరం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు చేస్తుండగా భారీ కొండచిలువ కనిపించడంతో కూలీలు హడలెత్తారు. ఈ ఘటన మండలంలోని చిన్నకంబలూరు గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. వివరాలు .. గ్రామ సమీపంలో ఉపాధి కూలీలు పనిచేస్తుండగా 13అడుగుల కొండచిలువ కనిపించింది. దాంతో భయాందోళనకు చెందారు. పనుల వద్ద నుంచి కొండచిలువను పక్కకు తరలించారు. అలాగే పెద్దకంబలూరు గ్రామంలో ఉపాధి పనుల వద్ద పాములు కనిపించాయి. పాములను ఉపాధి కూలీలు చంపేశారు.

వైసీపీ నాయకుడి మృతికి నివాళి



నివాళి అర్పిస్తున్న ఎర్రబోతుల, కాటసాని

కొలిమిగుండ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్దులాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రామసుబ్బారెడ్డి(75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. శుక్రవారం జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామానికి చేరుకొని రామసుబ్బారెడ్డి మృతహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సత్యాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, అబ్దులాపురం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కౌలుకార్డుల జారీ వేగవంతం

కోవెలకుంట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు కౌలు కార్డుల జారీ వేగవంతం చేయాలని తహసీల్దార్ పవన్ కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో కౌలుకార్డుల జారీపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు యజమాని, కౌలు రైతుల అగ్రిమెంటు, యజమాని పాస్ బుక్స్ జిరాక్స్, ఆధార్‌కార్డు, కౌలు రైతు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిజనిర్ధారణ అయిన తరువాత కార్డు జారీ చేయాలన్నారు. మండలంలో కౌలు రైతులంతా సంబంధిత వీఆర్వోను సంప్రదించి కౌలుకార్డు పొందాలని తెలిపారు.

గుర్తింపు కార్డులు తప్పనిసరి

బేతంచెర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏవో కిరణ్ కుమార్ తెలిపారు. కౌలు గుర్తింపు పత్రాల వల్ల ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు, లాభాలు పంట రుణాలు , పంట బీమా, పంట నష్టపరిహారం మద్దతు ధరకు పంటను అమ్ముకోవడం తదితర లాభాలు పొందువచ్చని తెలిపారు. వివరాల కోసం సంబంధిత వీఆర్వో, రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు.

'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలి

- దుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రవాదుల దాడికి ప్రతి చర్యగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, భారత సైనికులు, ప్రజలు క్షేమంగా ఉండాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని దుర్గమ్మ గుడిలో అమ్మవారికి ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ కన్వీనర్ సందు వెంకటరమణ ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు హేమసుందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఒంటెద్దు బండి కిరణ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భరణి రమేష్ పాల్గొన్నారు.

రహదారిలో మురుగు



తొడెండ్లపల్లె రహదారిలో ప్రవహిస్తున్న మురుగునీరు

చాగలమర్రి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొడెండ్లపల్లెలో మురుగునీరు రహదారిపైనే ప్రవహిస్తోంది. మురుగునీటిలో నుంచే వాహన దారులు, ప్రజలు రాకపోకలు చేస్తున్నారు. రహదారి పై మురికినీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కున వేలు వేసుకొని నడవాల్సిన పరిస్థితి నెలకొంది. దోమలు అధికం కావడంతో కాలనీ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు పోయేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయ స్వామి, చెన్నకేశవస్వామి, మాధవగట్ల నరసింహస్వామి గ్రూపు దేవాలయాల నూతన ధర్మకర్తలుగా దరఖాస్తు చేసుకోవాలని ఈవో మద్దిలేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ కార్యాలయంలో ఈ నెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పాలుట్ల రంగస్వామి దేవస్థానం ధర్మకర్తలుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.